# మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం



మంత్రిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎల్లారెడ్డి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు



రోడ్‌షోలో బైక్‌కు బీఆర్ఎస్ స్టిక్కర్లతో ఆకర్షణగా నిలిచిన యువకుడు

- సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు
- ఆలయం, దర్గాలో పూజలు, ప్రార్థనలు
- అభిమానుల కేరింతలతో ఉత్సాహంగా సాగిన ర్యాలీ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 24: ఎల్లారెడ్డి, లింగంపేటలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షో కోసం వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు పట్టణంలో ఘనస్వాగతం లభించింది. మధ్యాహ్నం ఒంటి గంటకు హెలిక్యాప్టర్‌లో వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు బొకేలు, పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కాన్వాయ్‌తో సాయిబాబా ఆలయానికి చేరుకున్న మంత్రి అక్కడ ప్రత్యేక పూజలు అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి హరీశ్‌రావు చేతికి స్థానిక వ్యాపారి ఎజాస్ అహ్మద్ మస్రూర్ ఇమామే జామీన్‌ను కట్టారు. అభిమానుల నృత్యాలు, కేరింతలు, ఆటపాటలతో ర్యాలీ ముందుకు సాగింది. పటాకుల మోతతో పట్టణం దద్దరిల్లింది. మంత్రి అభివాదానికి ప్రజలు, అభిమానుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. ర్యాలీలో బీఆర్ఎస్ స్టిక్కర్లను అతికించి, అలంకరించి బైక్‌పై పార్టీ అభిమాని చేసిన సందడి ప్రజలను ఆకట్టుకున్నది. ప్రచార రథంపై మంత్రి హరీశ్‌తోపాటు ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఎంపీ బీబీ పాటిల్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకుడు సాయిప్రకాశ్ దేశ్‌పాండే తదితరులు ఉన్నారు.



మంత్రి హరీశ్‌రావు ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు, మంత్రి రోడ్‌షోకు హాజరైన ఓ దివ్యాంగుడు

# హన్మంత్‌షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలి

బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత ప్రచారం



బండపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రజినీకాంత్‌రెడ్డి



సిర్పూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

పెద్ద కొడప్‌గల్/ డోంగ్లీ/ పిట్లం/ బిచ్కుంద, నవంబర్ 25: హన్మంత్‌షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. షిండే తరపున శుక్రవారం నియోజకవర్గంలోని పెద్దకొడప్‌గల్, డోంగ్లీ, పిట్లం, బిచ్కుంద మండలాల్లో ప్రచారం కొనసాగింది.

పెద్దకొడప్‌గల్‌తోపాటు బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, విఠల్‌వాడి, విఠల్‌వాడి తండా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ నమూనా ఈవీఎంతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బచ్చలి ఆంజనేయులు, ఎం.శివురాం, హన్మాండ్లు, పెద్దోళ్ల నారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామంలో నాయకులు శంకర్ పాటిల్, బస్వంత్‌రావు, హెచ్ పాటిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోసారి అధికారంలోకి వస్తే పింఛన్లను దశల వారీగా పెంచుతారని, రేషన్ షాపుల్లో సన్న బియ్యం సరఫరా చేస్తారని, రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తారని ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో విండో మాజీ చైర్మన్ అశోక్ పాటిల్, నజీర్, బాబా పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం మండలంలోని బండపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ రజినీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షిండేపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలే గెలుపు, ఓటములను నిర్ణయిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు షిండేకు పట్టం కడుతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నారం వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు గుంటి రాములు, పుట్టి రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి, మక్క, ఖద్‌గావ్, ఫత్లాపూర్, వాజీద్‌నగర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించాయి. షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని వివరించారు.



పెద్దకొడప్‌గల్ మండలం బేగంపూర్‌లో నమూనా ఈవీఎంతో ప్రచారం



బిచ్కుంద మండలంలో..

# బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి సమక్షంలో..

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 25: మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ సుధాకార్ గుప్తాతోపాటు ఆయన అనుచరులు 50 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎంపీపీ ప్రతాప్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అబివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, ప్రజలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి హన్మంత్ షిండేను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు రాములు, నాయకులు ఈశ్వరప్ప పటేల్, మహ్మద్, హన్మంత్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పుతున్న పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

# డిగ్రీ కాలేజీలో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్లు

బిచ్కుంద, నవంబర్ 24: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అకాడమిక్ కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ విశ్వ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు జి.చంద్రశేఖర్, వి.త్రివేణి, ఆరతి, జి.రాంబాబు హాజరయ్యారు. కాలేజీ రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. కాలేజీకి స్వయం ప్రతిపత్తి హోదా రావడంతో పాఠ్యాంశాలు, పరీక్షా విధానం తదితర అంశాలకు ఆమోదం తెలిపారు. ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.